dctelugu.com
డిస్ట్రిక్ కాలమ్
జిల్లాల వార్తావాహిని
e-PAPER

కరీంనగర్ | 04 సోమవారం, అక్టోబర్ 2026




# 42 వసంతాల 'హిమసాగర్ ఎక్స్‌ప్రెస్'..

## దేశంలో మూడో అత్యంత సుదీర్ఘ రైలు ప్రయాణం

**పెద్దపల్లి:**
కాశ్మీర్ మంచు కొండల నుండి కన్యాకుమారి సాగరం వరకు దేశాన్ని ఏకం చేస్తూ సాగే చారిత్రాత్మక 'హిమసాగర్ ఎక్స్‌ప్రెస్' అక్టోబర్ 3, 2026 నాటికి విజయవంతంగా 42 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. 1984 అక్టోబర్ 3న  అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఈ రైలును ప్రారంభించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఆమె ఢిల్లీ ఆల్ ఇండియా రేడియో ద్వారా ప్రసంగించారు.

పేరులోనే ఐక్యత:
'హిమం' అంటే మంచు (కాశ్మీర్), 'సాగర్' అంటే సముద్రం (కన్యాకుమారి). ఉత్తర–దక్షిణ భారతదేశాలను అనుసంధానిస్తూ దేశ సమగ్రతను, ఐక్యతను చాటాలనే లక్ష్యంతో నాటి తమిళనాడులోని హోసూర్ ఎంపీ పార్లమెంట్‌లో చేసిన ప్రతిపాదన ఆధారంగా ఈ రైలు అందుబాటులోకి వచ్చింది.

ప్రయాణ మార్గం – ప్రాముఖ్యత:
ప్రారంభంలో జమ్మూ తావి నుండి కన్యాకుమారి వరకు నడిచే ఈ రైలును, 2015లో శ్రీ మాతా వైష్ణో దేవి కాట్రా వరకు పొడిగించారు.
ఈ రైలు జమ్మూ కాశ్మీర్, పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళతో సహా మొత్తం 12 రాష్ట్రాల గుండా ప్రయాణిస్తుంది.
శ్రీ మాతా వైష్ణో దేవి కాట్రా, తిరుపతి, శబరిమల, కన్యాకుమారి వంటి ప్రముఖ ఆధ్యాత్మిక, పుణ్యక్షేత్రాలను సందర్శించే భక్తులకు ఈ రైలు ఎంతో ఉపయోగకరంగా ఉంది.

దేశంలో అత్యంత సుదీర్ఘ దూరం నడిచే రైళ్ల జాబితా:
సుమారు 14 సంవత్సరాల క్రితం వరకు భారతదేశంలోనే అత్యంత సుదీర్ఘ దూరం ప్రయాణించే రైలుగా హిమసాగర్ ఎక్స్‌ప్రెస్ అగ్రస్థానంలో ఉండేది. ప్రస్తుతం ఇది దేశంలోనే 3వ అత్యంత సుదీర్ఘ రైలుగా కొనసాగుతోంది.




వివేక్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్: దిబ్రూగఢ్ (అస్సాం) నుండి కన్యాకుమారి (తమిళనాడు) వరకు ప్రతిరోజూ నడుస్తుంది. (ప్రయాణ సమయం: సుమారు 75 గంటలు)
అరోనాయ్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్: తిరువనంతపురం (కేరళ) నుండి సిల్చార్ (అస్సాం) వరకు నడుస్తుంది. (ప్రయాణ సమయం: సుమారు 72 గంటలు)
హిమసాగర్ ఎక్స్‌ప్రెస్ (16317/16318): శ్రీ మాతా వైష్ణో దేవి కాట్రా నుండి కన్యాకుమారి వరకు నడుస్తుంది. (ప్రయాణ సమయం: సుమారు 70 గంటలు)

### పెద్దపల్లిలో హాల్ట్ పునరుద్ధరణకు విజ్ఞప్తి:

1984లో ఈ రైలు ప్రారంభమైన సమయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నలుమూలల నుండి ప్రజలు పెద్దపల్లికి వచ్చి రైలును ఆసక్తిగా తిలకించారు. 1984 నుండి 1996 వరకు ఈ రైలుకు పెద్దపల్లి జంక్షన్‌లో హాల్ట్ ఉండేది. ఆ తర్వాత ఇక్కడ స్టాప్‌ను తొలగించి రామగుండంకు మార్చారు.
ప్రస్తుతం పెద్దపల్లిలో హాల్ట్ లేకపోవడం వల్ల శబరిమల, తిరువనంతపురం, కన్యాకుమారి వైపు వెళ్లే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కాబట్టి, హిమసాగర్ ఎక్స్‌ప్రెస్‌కు తిరిగి పెద్దపల్లి జంక్షన్‌లో హాల్టింగ్ సదుపాయం కల్పించేలా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, స్థానిక బీజేపీ నాయకులు చొరవ చూపాలని ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం విజ్ఞప్తి చేస్తోంది.

---

## వెలిచాలలో 14వ విడత శ్రమదానం..



**రామడుగు డీసీ**
రామడుగు మండలంలోని వెలిచాల గ్రామంలో 14 విడత శ్రమదానం కార్యక్రమాన్ని ఆదివారం చేట్టారు. గ్రామపంచాయతీ పరిధిలోని గుడివెలుగులపల్లిలోఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వీర్ల నర్సింగారావు మాట్లాడారు. 14 విడతలుగా శ్రమదానం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే గ్రామస్తులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఇంటికి రెండు మొక్కలు అందజేస్తామని అవి నాటే బాధ్యత కూడా గ్రామపంచాయతీ చూసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, యువకులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఎడ్యుకేటర్ల నియామకానికి దరఖాస్తుల  ఆహ్వానం

**కరీంనగర్ డీసీ**
జిల్లాలోని మండలాలలో కల (19) పి.ఎం.శ్రీ  ఉన్నత పాఠశాలలో పనిచేయుటకు అర్హత కలిగిన స్పెషల్ ఎడ్యుకేటర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి  చైతన్య జైని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక బి.ఈడి  అర్హత కలిగి, ఆసక్తిగల ఉపాధ్యాయులు సంబంధిత పాఠశాలలో దరఖాస్తు చేసుకోవొచ్చని పేర్కొన్నారు.  వీరికి నవంబరు 26 నుంచి మార్చి 27 వరకు 5 నెలలు ప్రతినెల రూ. 16 వేలా 500ల గౌరవ వేతనం ఉంటుందని తెలిపారు.  03-10-2026 నుంచి 08-10-2026 వరకు సంబంధిత పాఠశాలలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు.  మరిన్ని వివరాలకు సంబంధిత ప్రధానోపాధ్యాయులను సంప్రదించవలెను.